క్లుప్తంగా

భ్రూణహత్యలు నేరం

మానకొండూర్‌రూరల్‌: భ్రూణ హత్యలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీఓ సబిత అన్నారు. మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం గర్భిణులతో మాట్లాడారు. ఆడ, మగ శిశువులను సమానంగా చూడాలన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు చేయించుకోవద్దని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న తడగొండ శంకర్

రామడుగు: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం గ్రామాల్లో ఘనంగా జరుపుకోవాలని ఎమ్మార్పీఎస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ శంకర్ మాదిగ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం మాట్లాడారు. ముప్పై ఏళ్లుగా చేస్తున్న పోరాటం నెరవేరబోతున్న సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాలను ఎగురవేసి వేడుకలు నిర్వహించుకోవాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాజయ్య, హన్మంతు, రవి, విజయ్, మల్లేశం పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

వీణవంక : మండలంలోని ఘన్ముకుల, దేశాయిపల్లి గ్రామాల్లో కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ పాడి రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ జయకర్ మాట్లాడుతూ.. పాడి పశువుల ఎంపిక, కొనుగోలు, జాగ్రత్తలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జమ్మికుంట ఎంసిసి మేనేజర్ అంజిరెడ్డి,సూపర్‌వైజర్ కనకే రాజేందర్ ,వీఏ నరసింహస్వామి, సంస్థ అధ్యక్షుడు ఉమాంతల రాజిరెడ్డి, పాకాల ప్రభాకర్‌రెడ్డి పాడి రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

చిగురుమామిడి: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జెడ్పీటీసీ గీకురు రవీందర్ అన్నారు. చిగురుమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. రోగులకు ఇచ్చే మందులు, వారి వివరాలు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా లేదా అని వైద్యాధికారి మాధురిని అడిగి తెలుసుకున్నారు. మలేరియా, డెంగీ, విషజ్వరాలు రాకుండా దోమల నివారణకు మురుగు కాల్వలు శుభ్రం చేయాలన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగేలా ప్రజలను చైతన్యపర్చాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు ఐరెడ్డి సత్యనారయణరెడ్డి, చీల లక్ష్మారెడ్డి, పోటు మల్లారెడ్డి, మరో వైద్యాధికారి అఫ్సానా, ఫార్మసిస్టు రామేశం, స్టాఫ్‌నర్స్ కె. భారతి ఉన్నారు.

యాదవ సంఘం కార్యాలయం ప్రారంభం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

జమ్మికుంట: మండలంలోని కోరపల్లి గ్రామంలో అఖిల భారత యాదవ మహాసభ సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు బక్కతట్ల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ యాదవ్ చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో యాదవులు అత్యధికంగా జనాభా కలిగి ఉన్నారని, మంజూరై నిర్మాణం కాకుండా నిలిచిపోయిన అనుమతులను ప్రత్యేక శ్రద్ధతో సొంత భవనం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గిరవేన శ్రీనివాస్ యాదవ్ ,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బాషబోయిన మల్లేష్ యాదవ్, గీతాంజలి యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవియాదవ్, గ్రామ ప్రధాన కార్యదర్శి నరేష్ యాదవ్, ఉపాధ్యాక్షుడు శంకర్‌యాదవ్, కోశాధికారి శ్రీనివాస్ యాదవ్‌తోపాటు కమిటి, సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పరామర్శ

చిగురుమామిడి: బీఆర్ఎస్ మహిళావిభాగం రామంచ గ్రామశాఖ అధ్యక్షురాలు సిద్దెంకి సారవ్వ ఇటీవల మృతిచెందగా ఆమె కూతురు సువర్ణ, తమ్ముడు రాయమల్లును బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. పార్టీ ద్వారా కొంత ఆర్థిక సాయం అందించారు. నాయకులు పెనుకుల తిరుపతి, గిట్ల తిరుపతిరెడ్డి, తాజామాజీ సర్పంచ్ గుంటి మాధవి, మాజీ ఉపసర్పంచ్ ఒంటెల కిషన్‌రెడ్డి, మానేటి మురలిధర్‌రెడ్డి, గుంటి తిరుపతి, పేర్యాల తిరుపతిరావు, బోయిని తిరుపతి, పైస కొంరయ్య వారి వెంట ఉన్నారు.

ఏటా మునక.. భయాందోళనలో ప్రజలు


'నా పేరు వెనిశెట్టి కాశీనాథం, జమ్మికుంట పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉంటూ జనరల్, కిరాణా షాపు నిర్వహిస్తున్నాను. వరదకాలువ ముంపు పదిహేనేళ్లుగా ఉంటుంది. మూడేళ్లల్లో భారీ వరదలతో రెండుసార్లు కాలనీ మునిగింది. ఇల్లు పూర్తిగా మునిగి వస్తువులు, సామగ్రి తడిసిపోయాయి. ఇప్పటివరకు రూ.మూడు లక్షల వరకు ఆస్తినష్టం జరిగింది. తాత్కాలికంగా రూ.3,800 నష్ట పరి హారం అందించారు. ఏటా ఇదే పరిస్థితి, వానా కాలమంటేనే భయమేస్తోంది. ఇది నా ఒక్కడి పరిస్థితి కాదు కాలనీలోని ప్రజల అందరిది'. వరద కాలువ జాప్యం వల్ల నష్టం వాటిల్లుతుంది.

- మూడేళ్లలో రెండుసార్లు భారీ వరదలు
- పలు కాలనీవాసులకు భారీగా ఆస్తినష్టం
- వరదకాలువ నిర్మాణంలో జాప్యం
- సమస్య పరిష్కరించాలని కోరుతున్న కాలనీవాసులు

జమ్మికుంట: వర్షాకాలం వచ్చిందంటే పట్టణ ప్రజలు వణికిపోతున్నారు. మూడేళ్లల్లో రెండుసార్లు వరదలు వచ్చాయి. పట్టణంలోని 6, 8 ,12, 22 వార్డులతోపాటు అంబేద్కర్‌కాలనీ, నాయిని చెరువు ప్రాంతంలోని ఇతర వార్డులు చిన్నవానకే మునకేస్తున్నాయని కాలనీలవాసులు భయాందోళనకు గురవుతున్నారు. అర్ధరాత్రి వర్షాలు వస్తే కాలనీవాసులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. పదిహేనేళ్లుగా వరద కాలువ నిర్మాణం చేయాలని, ముంపునకు గురికాకుండా ప్రధాన సమస్య తీర్చాలనే డిమాండ్ కొనసాగుతోంది. కానీ ప్రభుత్వం, పాలకవర్గం సమస్య పరిష్కరించకుండా తీవ్ర జాప్యం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఏటా వర్షాకాలంలో సమస్య పునరావృత్తం అవుతుంది. తీవ్రమైన వరద సమస్యకు వరదకాలువ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. కాలనీ ఇళ్లల్లోకి వరదనీరు చేరి రూ.భారీగాఆస్తినష్టం వాటిల్లుతోందని, జీవనం దుర్భరంగా మారుతుందని, సమస్యను వెంటనే పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.


2021లో నీట మునిగిన కాలనీ (ఫైల్)

సమస్యలు ఇలా..

- రైల్వే అండర్ బ్రిడ్జి 21 ఫీట్ల వెడల్పుతో వరద నీరు వస్తుంది.
- హౌజింగ్‌బోర్డు కాలనీ లోతట్టులో ఉంది.
- వరదనీరు వెళ్లే దారులు కబ్జాకు గురయ్యాయి.
- కాలనీలో నిర్మిచిన డ్రైనేజీల నుంచి వరదనీరు బయటకు వెళ్లడం లేదు.
- తాత్కాలికంగా డ్రైనేజీలు నిర్మించిన వరద ఉధృతితో ముప్పు వాటిల్లితుంది.
- శాశ్వత పరిష్కారం చూపకపోతే రాబోయే రోజుల్లో తీవ్ర ఆస్తి, ప్రాణనష్టం జరిగే అవకాశాలున్నాయి.

వరద వచ్చేది ఇలా..

- ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లి నుంచి పిట్టల వాడ రైల్వే అండర్ బ్రిడ్జి మోరి ద్వారా మురుగు, వరదనీరు వస్తుంది. రైల్వే శివారు ప్రాంతం నుంచి వరద లోతట్టు కాలనీలోకి చేరుతుంది. గంటల వ్యవధిలో ఇళ్లల్లోకి నీరు చేరుతుంది. ఇంట్లోని విలువైన వస్తువులు, సామగ్రి నీట మునిగి వరదలో కొట్టుకు పోతున్నాయి. వరదలకు విష పురుగులు, పాములు ఇళ్లలోకి వస్తున్నాయి. కాలనీలో నెలరోజుల వరకు దుర్గంధం భరించలేకపోతున్నారు.
- 2021, 2023లో వరదనీరు ఇళ్లల్లోకి చేరడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. 2022 జూలై 21న అప్పటి ఎమ్మెల్సీ, ప్రస్తుత ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, కలెక్టర్, ఇతర అధికారులు హౌజింగ్ బోర్డు, అంబేద్కర్‌కాలనీలో పర్యటించి నివేదిక పంపించాలని అధికారులకు సూచించారు. మళ్లీ 2023 జూలై 27 తెల్లవారుజామున వరదనీరు కాలనీలోకి నీరు చేరింది. కాలనీవాసులు భయందోళనతో బయటకు పరుగులు తీశారు. ఇప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు శాశ్వత పరిష్కారం చూపలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


వరద నీరు వచ్చే రైల్వే అండర్ బ్రిడ్జి

వరదనీరు ఇళ్లలోకి వస్తోంది


ఏళ్ల క్రితం నిర్మించిన ఇరుకైన డ్రైనేజీల వల్ల వరదనీరు ఇళ్లల్లోకి చేరుతుంది. నిత్యావసర సరుకులు, విలువైన సామగ్రి వరదనీటిలో తడిసి పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం వాటిళ్లుతోంది. ఇళ్లు కూలిపోయే పరిస్థితిలో ఉన్నాయి. వరదకాలువ నిర్మాణం చేపట్టాలి.

– తూడి రవిచంద్రరెడ్డి, మాజీ వార్డు సభ్యుడు,హౌజింగ్ బోర్డు కాలనీ

వరదకాలువ నిర్మించాలి


రెండుసార్లు వరదలు రావడంతో ఇళ్లల్లోకి నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరదకాలువ నిర్మాణం చేపట్టాలని పలుమార్లు ఆందోళనలు, విజ్ఞప్తులు చేసినా ఫలితం లేదు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరుతున్నాం.

– శ్రీపతి నరేశ్, ఆరో వార్డు కౌన్సిలర్, జమ్మికుంట

సమస్య పరిష్కారానికి కృషి


వరదనీరు వెళ్లేందుకు తాత్కాలికంగా డ్రైనేజీల్లోని సిల్ట్, చెత్తాచెదారం తొలిగించాం. వరదకాలువ నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం. పూర్తి స్థాయిలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– ఎండీ అయాజ్, మున్సిపల్ కమిషనర్, జమ్మికుంట

నియామకం

మానకొండూర్: మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామంలో శుక్రవారం యాదవ సంఘం నూతన కమిటీ ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా సంగ చిన్న మల్లయ్యయాదవ్, జనరల్ సెక్రటరీగా జిల్లాల రాజుయాదవ్, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులను యాదవ సంఘం నాయకులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ ఏడో డివిజన్ అధ్యక్షుడిగా బండి మల్లేశం

మానకొండూర్: మండలంలోని సదాశివపల్లి గ్రామానికి చెందిన బండి మల్లేశంను కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని సదాశివపల్లి ఏడో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమించినట్టు పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా మల్లేశ్ శుక్రవారం నియామకపత్రం అందుకున్నారు. నియామకానికి కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారీ, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్‌గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గసికంటి సంపత్, రామిడి తిరుపతి, మర్రి ఓదెలు, కనుకం అశోక్, జడల రమేష్, రమణ మల్లేశం హర్షం వ్యక్తం చేశారు.

హాస్టల్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కృషి చేయాలి

హుజూరాబాద్: నియోజకవర్గంలో శిథిలావస్థలో ఉన్న బీసీ బాలుర, బాలికల హాస్టల్ నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కృషి చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాముయాదవ్ కోరారు. శుక్రవారం హుజూరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అద్దె భవనాలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి హుజూరాబాద్ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ప్రభుత్వం మెస్‌చార్జీలు పెంచడంతోపాటు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలన్నారు. మండల సహాయ కార్యదర్శి రోహిత్, కృష్ణ, మణి, ప్రవీణ్, రాజు, వెంకటేశ్ పాల్గొన్నారు.

పనిచేసే చోట గుర్తింపు తెచ్చుకోవాలి


గంగాధర:మాట్లాడుతున్న సీఈవో


రామడుగు: సన్మానిస్తున్న నాయకులు

గంగాధర: ఉద్యోగులకు బదిలీ, ఉద్యోగ విరమణ తప్పదని పనిచేసే చోట గుర్తింపు తెచ్చుకోవాలని కరీంనగర్ జెడ్పీ సీఈవో మొగిలి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని న్యాలకొండపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పోలు సత్యనారాయణ ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం పాఠశాల ఆవరణలో వీడ్కోలు, సన్మాన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. శ్రీనివాస్ బోధనతోపాటు విద్యా సామగ్రి అందజేస్తూ విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టేవారని అన్నారు. విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దే అవకాశం ఉపాధ్యాయులకే ఉందన్నారు. సత్యనారాయణను తోటి ఉపాధ్యాయులు, మాజీ సర్పంచు రేండ్ల జమున ఘనంగా సన్మానించారు. ఆర్డీవో మహేశ్వర్, ఎంపీడీవో రాము, ఎంఈవో వేణుకుమార్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ముస్కు తిరుపతిరెడ్డి, టిపాస్ అధ్యక్షుడు రాజేశ్వర్, ఎస్టీయూ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని తిర్మలాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కారుపాకలపల్లి ప్రధానోపాధ్యాయులు పటేల్ సత్యనారాయణరెడ్డి ఉద్యోగవిరమణ శుక్రవారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. సత్యనారాయణరెడ్డి దంపతులను పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. సందర్భంగా సత్యనారాయణరెడ్డి చేసిన సేవలను కొనియాడారు.

సంక్షిప్త వార్తలు

● అంగన్వాడీ కేంద్రాల్లో గ్రోత్ డే

రామడుగు: అంగన్వాడీ కేంద్రాలలో అందజేస్తున్న సేవలను ప్రతి సద్వినియోగం చేసుకొవాలని ఎంపీడీవో రాజేశ్వరీ కోరారు. మండల కేంద్రం రామడుగులో శుక్రవారం ఐసీడీఎస్ వారి ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రంలో గ్రోత్ డే నిర్వహించారు.

మానకొండూర్‌రూరల్‌: అంగన్‌వాడీ కేంద్రాలల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుంటూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ సబిత అన్నారు. మండలంలోని ఊటూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రోత్ డే నిర్వహించగా సీడీపీఓ సందర్శించారు. పిల్లల బరువు, ఎత్తును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

● ఎమ్మెల్యేకు పరామర్శ

రామడుగు: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి మృతి చెందడంతో శుక్రవారం పలువురు నాయకులు ఎమ్మెల్యేను పరామర్శించారు. మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాజీ భాస్కర్‌రెడ్డి, ఉన్నారు.

● నియామకం

తిమ్మాపూర్: హైదరాబాద్ జలసౌధలోని ఇంజనీర్ ఇన్ చీఫ్ సమావేశ మందిరంలో ఎస్.విశ్వంభరాచారి ఆధ్వర్యంలో తెలంగాణ నాన్ టెక్నికల్ పర్సనల్ అసిస్టెంట్ (ఎన్‌టీపీఏ గెజిటెడ్) సంఘం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా కొలుగూరి వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా లెక్కల రామచంద్రారెడ్డి, సహ అధ్యక్షుడిగా మామిడి రమేష్, కోశాధికారిగా శెట్టి సురేష్, ఉపాధ్యక్షులుగా వెంకటరమణ, శైలజారాణి, చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శులుగా హన్మంతు, మసున లక్ష్మణ్, అనితరాణి, కార్యనిర్వాహణ కార్యదర్శిగా బుట్టి సత్యనారాయణ కార్యవర్గ సభ్యులుగా రాజమల్లయ్య, గురువయ్య, సైఫుల్లా, వినయ్‌కుమార్‌ను ,విశ్వంభరాచారిని సంఘం సలహాదారుడిగా ఎన్నుకున్నారు.

● స్వశక్తి సంఘాలను బలోపేతం చేయాలి

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి, చిగురుమామిడిలోని గాడిదల (డాంకీ) సంరక్షణ కేంద్రాలను కరీంనగర్, సిద్దిపేట్ జిల్లాల డీఆర్‌డీపీ ప్రాజెక్టు డైరెక్టర్లు పి. శ్రీధర్, ఆచార్య జయదేవ్ శుక్రవారం సందర్శించారు. పెంపకం, ఇతర వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిగురుమామిడి సెర్ప్ కార్యాలయానికి వచ్చారు. మండలంలోని స్వశక్తి సంఘాల మహిళలు తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లిస్తున్నారా లేదా అని ఏపీఎం సంపత్‌ను అడిగి సంఘాలను బలోపేతం చేయాలని సూచించారు.

● ఏఐ టెక్నాలజీతో ప్రచారం

తిమ్మాపూర్: బడిబాటలో భాగంగా మండలంలోని మల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ టీచర్ షరీఫ్ అహ్మద్ వినూత్న రీతిలో ప్రచారం చేపట్టారు. ఏఐ టెక్నాలజీతో పాఠశాలపై వీడియో రూపొందించారు. పాఠశాలలోని సౌకర్యాలు, విద్యార్థులకు కల్పించే వసతులు, ఇతర వివరాలను వీడియోలో వివరించారు.

● చిడుతల రామాయణం ప్రదర్శన

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణకాలనీలో చిడుతల రామాయణం ప్రదర్శించారు. గుజ్జుల భూంరెడ్డి స్మారకార్థం మనవడు ప్రణీత్‌రెడ్డి ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు ఆంజనేయ భక్త భజన మండలి బృందం కళాకారులతో ప్రదర్శన ఇప్పించారు. నుస్తులాపూర్ సొసైటీ చైర్మన్ గుజ్జుల రవీందర్‌రెడ్డి ప్రారంభించగా సమీప గ్రామాల ప్రజలు తరలివచ్చి ప్రదర్శన తిలకించారు.

● ఉపాధ్యాయులను నియమించండి

ఇల్లందకుంట: గడ్డివానిపల్లి ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్, ఆయా ఆయాను నియమించి పిల్లల భవిష్యత్ కాపాడాలని గ్రామ కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ డీఈఓను కోరారు.

● మహిళా సాధికారత కోసమే 'మిషన్ శక్తి'

మానకొండూర్: కేంద్ర ప్రభుత్వం మహిళల సాధికారత కోసం మిషన్ శక్తి పథకం ప్రవేశపెట్టిందని కరీంనగర్ జిల్లా మహిళ సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్టు డి. కవిత అన్నారు. మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వందరోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా మానకొండూర్ రైతు వేదికలో శుక్రవారం మహిళలతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు.

● పీవీకి ఘన నివాళి

హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పీవీ హుజూరాబాద్ జిల్లా సాధన జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం దివంగత ప్రధాని పీవీ నరసింహరావు జయంతి నిర్వహించారు. అలయన్స్ క్లబ్ సభ్యులు పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జయంతి నిర్వహించారు.

జమ్మికుంట: మండలంలోని వావిలాల ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్టాన్ సంస్థలో జయంతి నిర్వహించారు. పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

వెండి కిరీటాలు బహూకరణ


వెండి కిరీటాలు అందిస్తున్న కుటుంబసభ్యులు

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామం శ్రీమానసాదేవి ఆలయంలోని రామలక్ష్మణ జానకి, హనుమాన్ విగ్రహాలకు అదే గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ బద్దం మహిపాల్ రెడ్డిమాధురిరెడ్డి, కుమారుడు విహాన్‌రెడ్డి నాలుగు కిలోల వెండి కిరీటాలను అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులకు శుక్రవారం అందించగా వారు తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు బద్దం చిన్ననర్సింహారెడ్డి, చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, బద్దం మల్లారెడ్డి, జగ్గారెడ్డి, తిరుపతిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, కర్ర్నె చంద్రయ్య, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్ష, డైరెక్టర్ల ఎన్నిక

చిగురుమామిడి: మండలంలోని రామంచ గ్రామంలో శుక్రవారం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఎన్నికలు నిర్వహించారు. సంఘం కార్యాల యం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో రూట్ సూపర్‌వైజర్ అప్పాల మల్లయ్య ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా కూతురు మల్లారెడ్డి, డైరెక్టర్లుగా దొబ్బల తిరుపతి, సిద్దెంకి అర్జున్, శివరాత్రి ఎల్లయ్య ఎన్నికయ్యారని సూపర్‌వైజర్ మల్లయ్య తెలిపారు. ఈ సమావేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న డైరెక్టర్లు మానేటి మురళీధర్‌రెడ్డి, పైస ఎల్లయ్య, వంటకాల సంపత్‌రెడ్డి, తాల్లపల్లి సంపత్, చెరుకు నవీన్, దాసరి రవి, పాల సంఘం కార్యదర్శి రంగు సంపత్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అధిక దిగుబడికి జీలుగ సాగు చేయాలి

హుజూరాబాద్‌రూరల్‌: రైతులు జీలుగ సాగు చేయాలని ఏడీఏ సునీత అన్నారు. మండలంలోని కాట్రపల్లి, ఇప్పల నర్సింగాపూర్ తదితర గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలను శుక్రవారం సందర్శించి పలువురు రైతులకు జీలు సాగు ప్రయోజనాలను వివరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీలుగ సాగుతో నేలలు సారవంతమవుతాయని, నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని, అధిక దిగుబడి సాధించవచ్చన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో చందుపట్ల సునీల్ కుమార్, ఏఈవో, రైతు గూడూరు స్వామిరెడ్డి తదితరులు ఉన్నారు.

తెగిపడిన విద్యుత్ తీగలు



మానకొండూర్‌రూరల్‌: మండలంలోని విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షాకాలానికి ముందు విద్యుత్ స్తంభాలు, లూజ్ వైర్లను సవరించక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని వెల్ది గ్రామంలో విద్యుత్ తీగలు కిందికి వేళాడుతున్నాయని ఇటీవల గ్రామస్తులు విద్యుత్ సిబ్బందికి దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోలేదు. శుక్రవారం బస్టాండ్ సమీపంలోని ఖాళీ స్థలంలో ట్రాక్టర్ పార్కింగ్ చేయగా సాయంత్రం గాలివానకు విద్యుత్ తీగలు తెగి ట్రాక్టర్‌పై పడ్డాయి. గ్రామస్తులు అధికారులకు సమాచారం అందించడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. పెనుప్రమాదం తప్పిందని గ్రామస్తులు చర్చించుకున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


పూజల్లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లిలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుడు గూడా జగదీశ్వరశర్మ ప్రత్యేక పూజలు, ఇతర కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శేషం వరప్రసాద్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ విజయ గణపతి, మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, కౌన్సిలర్లు, ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడురవీందర్, ఉపాధ్యక్షుడు జయేందర్, ప్రధాన కార్యదర్శి రామూర్తి, భక్తులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధి అల్గునూర్ శ్రీవెంకటేశ్వరకాలనీలోని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి, శ్రీరామసాయి ఆలయ వార్షికోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితులు తిరునగిరి వెంకటాద్రి స్వామి, తిరునగిరి చక్రధరస్వామి, తాడురి సుగుణాకర్ స్వామి, తిరునగిరి వాసుదేవకుమార్, లక్ష్మీవర్ధన్‌స్వామి, విష్ణువర్ధన్ స్వామి ప్రత్యేక పూజలు, హోమం తదితర కార్యక్రమాలు జరిపించారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వేడుకలకు హాజరయ్యారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు నరసయ్య, కళ్యాణ్ చంద్ర, రాజయ్య, మల్లేశం, వెంకన్న, శ్రీనివాస్, శేఖర్, మధుసూదన్, సుధాకర్ రెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్, విజయ్, చిందం అంజి, మృత్యుంజయం, సిద్ధయ్య, కార్పొరేటర్ శారదరవి, మల్లారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

● ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ దాడులు

చొప్పదండి: మండలంలోని రాగంపేటలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు పదకొండు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. టాస్క్‌ఫోర్స్ సీఐ కె. నాగేశ్వర్‌రావు తెలిపిన వివరాలు... రాగంపేటకు చెందిన బాసరవేని శ్రీనివాస్, ధర్మారం మండలం బంజరుపల్లికి చెందిన ఇస్లావత్ కేవ్ల గుడుంబా సరఫరా, అమ్మకం చేస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో హెచ్‌సీ మోసిన్, ఈసీలు కుమార్ యాదవ్, ఖాసీంబీ, కమలాకర్, కమాలుద్దీన్, సంతోష్ పాల్గొన్నారని తెలిపారు.

● ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జమ్మికుంట: మానేరు వాగునుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని శుక్రవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. గంధ్రపల్లి గ్రామానికి ఓ వ్యక్తి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా పెట్రోలింగ్ పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్, ట్రాక్టర్ యాజమానిపై కేసు నమోదు చేశామన్నారు.

● గుండెపోటుతో ఒడిశా కూలీ మృతి

తిమ్మాపూర్: మండలంలోని పొరండ్ల శివారులోని ఓ ఇటుకబట్టీలో పని చేసేందుకు 10 రోజుల క్రితం వచ్చిన ఒడిశా కార్మికుడు గుండెపోటుతో గురువారం రాత్రి మృతిచెందాడు. ఎస్సై చేరాలు కథనం ప్రకారం.. సాధు చరిహా, కూస చరిహా(24) పది రోజుల క్రితం ఇటుక బట్టీల్లో పనికోసం వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న రామేశ్వర్ చరిహాతో కలిసి పనులు చేస్తున్నారు. గురువారం పనులు పూర్తిచేసుకుని రాత్రి ముగ్గురూ కలిసి భోజనం చేసి నిద్రపోయారు. శుక్రవారం ఉదయం కూస చరిహా నిద్రలేవకపోవడంతో యజమానికి సమాచారం ఇచ్చారు. ఆర్ఎంపీని పిలిపించి పరిశీలించారు. అనంతరం కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. గుండెపోటు, ఫిట్స్‌తో మృతిచెందినట్లు ప్రాథమికంగా నిర్ధారణ చేశారు. బట్టీ యజమాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

●వాహనాలు సీజ్

శంకరపట్నం: నంబర్ ప్లేట్‌లేని వాహనాలను కేశవపట్నం పోలీసులు సీజ్‌చేశారు. మండల పరిధిలో శుక్రవారం కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై వాహనాలను ఎస్సై లక్ష్మారెడ్డి తనిఖీ చేశారు. వాహనాల డాక్యుమెంట్లు, లైసెన్స్, పరిశీలించారు. సరియగు పత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు.